**విలేకరులు కావలెను**

**మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



TITLE Code TEL TEL12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA





హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల   ఆదివారం 1 సెప్టెంబర్ 2024   పేజీలు : 4 వెల : 2.00


## మీ సేవ కేంద్రాల ద్వారా కొత్తగా తొమ్మిది రకాల సేవలు





**మన వార్త** తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా కొత్తగా తొమ్మిది రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. తహశీల్దారు కార్యాలయాల్లో కాకుండా వివిధ ధ్రువీకరణ పత్రాలను ఆన్లైన్ ద్వారా అందించాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నిర్ణయించారు.ప్రస్తుతం తహశీల్దార్లు నేరుగా జారీ చేస్తున్న పత్రాలను ప్రజలు ఆన్లైన్లో మీ సేవా కేంద్రాల నుంచి పొందేలా చర్యలు చేపట్టారు. తొమ్మిది రకాల పత్రాలకు సంబంధించిన వివరాలు 'మీ సేవ ఆన్ బోర్డ్'లో ఉంచేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ఆదేశించింది.మీ సేవ ద్వారా పొందే పత్రాలుపౌరుల పేరు మార్పిడి, తరచూ జారీ చేసే ఆదాయం, కుల తదితర ధ్రువీకరణ పత్రాలు, స్థానికత నిర్ధారణ (లోకల్ క్యాండిడేట్),స్టడీ గ్యాప్ సర్టిఫికెట్, మైనారిటీ ధ్రువీకరణ,క్రీమీలేయర్, నాన్ క్రీమీలేయర్,మార్కెట్ విలువ,-ఖాస్రా, పహాణీల వంటి పాత ధ్రువీకరణ పత్రాలు,ఆర్వోఆర్-1(బి) సర్టిఫైడ్ కాపీలు నూతనంగా మీ సేవల ద్వారా పొందవచ్చు.

## హైకోర్టును ఆశ్రయించిన పల్లా రాజేశ్వర్ రెడ్డి...
## హైడ్రాకు కీలక ఆదేశాలు జారీ...



బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి సంబంధించిన అనురాగ్, నీలిమ విద్యాసంస్థలపై 'హైడ్రా' దృష్టి సారించింది. హైదరాబాద్ శివారు ప్రాంతం ఘట్ కేసర్ మండలం వెంకటపూర్ పరిధి నాదం చెరువు బఫర్ జోన్‌లోని భూమిని ఆక్రమించి విద్యాసంస్థలు నిర్మించారని ఆయనపై వచ్చిన ఫిర్యాదుతో 'హైడ్రా' అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో పల్లా రాజేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తాను నిబంధనలకు అనుగుణంగా విద్యాసంస్థలు నిర్మించామని, డాక్యుమెంట్లను పరిశీలించాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారించిన హైకోర్టు ధర్మాసనం.. హైడ్రాకు కీలక ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు ప్రకారం నడుచుకోవాలని అధికారులకు సూచించింది. పల్లా విద్యాసంస్థలు బఫర్ జోన్‌లో ఉందా..ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయా అనే తేల్చాలని ఆదేశించింది. వివరాలు సేకరించిన తర్వాతే నోటీసులు జారీ చేయాలని సూచించింది. అప్పటి వరకూ ఎలాంటి దూకుడు చర్యలు చేపట్టొద్దని హైడ్రాకు ఆదేశాలు జారీ చేసింది.

## అరేబియా సముద్రంలో తుఫాన్...



**మన వార్త** అరేబియా సముద్రంలో తుఫాన్ ఏర్పడింది. దీనికి పాకిస్థాన్ సూచించిన 'అస్నా' అని పేరు పెట్టారు. ఆగస్టులో తుఫాన్‌లు రావడం చాలా అరుదు.అయితే సముద్రాలు వేడెక్కడంతో తుఫాన్ ఏర్పడింది. అరేబియా సముద్రంలో ఆగస్టులో 1891 నుంచి 1976 వరకూ మూడు తుఫాన్‌లు వచ్చాయి. 'అస్నా' నాలుగోది. గతంలో 1944, 1964, 1976 సంవత్సరాల్లో ఆగస్టు నెలలో తుఫాన్‌లు వచ్చాయి.

## కేసీఆర్ గత పదేండ్లలో ప్రాజెక్టుల పేరుతో
# వేల కోట్ల స్కామ్...




**మన వార్త** కేసీఆర్ గత పదేండ్లలో ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రాన్ని లూటీ చేశారని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కట్టిన ప్రతి ప్రాజెక్టులో వేల కోట్ల స్కామ్ కు పాల్పడి, జేబులు నింపుకున్నారని ఫైర్ అయ్యారు. శుక్రవారం ములుగు జిల్లాలోని దేవాదుల పంప్‌హౌస్, సమ్మక్క సాగర్ బ్యారేజీలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కతో కలిసి ఉత్తమ్ పరిశీలించారు. దేవాదుల ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్ వద్ద ఇరిగేషన్ ఆఫీసర్లతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. కేసీఆర్ గత పదేండ్లలో ఇరిగేషన్ శాఖను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. 2026 మార్చి కల్లా దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తి చేసి, 5.57 లక్షల ఎకరాలకు నీళ్లందిస్తామని ఉత్తమ్ తెలిపారు. "వైఎస్ సీఎంగా ఉన్న టైమ్?లో దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ శంకుస్థాపన కోసం 2008లో సోనియాగాంధీ యూపీఏ చైర్ పర్సన్ హోదాలో హాజరయ్యారు. 2026 మార్చి నాటికి దేవాదుల పనులన్నీ పూర్తి చేసి, మళ్లీ సోనియాగాంధీ చేతుల మీదుగానే ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తాం. తద్వారా వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలోని 5.57 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందుతాయి' అని చెప్పారు. సమ్మక్క సాగర్ నుంచి 60 టీఎంసీలు ఎత్తిపోస్తం..సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీటిని నిల్వ చేసేందుకు చత్తీస్ గఢ్ రాష్ట్రాన్ని ఒప్పించి, 300 రోజుల పాటు మోటార్లు నడపడం ద్వారా 60 టీఎంసీలు ఎత్తిపోస్తామని ఉత్తమ్ తెలిపారు. ఇందుకోసం ఇరిగేషన్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఈఎన్సీ నాగేందర్‌ను చత్తీస్ గఢ్ కు పంపించామని చెప్పారు. "ఇరిగేషన్ శాఖ బలోపేతం కోసం 700 మంది సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను, 1,800 మంది లష్కర్లను ఔట్ సోర్సింగ్ పై నియమించాం. ఇరిగేషన్ ప్రాజెక్ట్ లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణను పూర్తి చేయడానికి ఐఏఎస్ స్థాయి అధికారిని నియమిస్తాం.కాల్వల్లో పూడికతీత, జంగల్ క్లియరెన్స్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల కోసం రూ. 1,100 కోట్లు కేటాయిస్తాం. పెండింగ్ బిల్లులు క్లియర్?చేస్తాం' అని వెల్లడించారు. ఇంజినీర్లు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. భూసేకరణకు రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.ప్రాజెక్టులు పూర్తయితే ప్రజలకు చేతినిండా పని : సీతక్క...ఇరిగేషన్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేస్తే ప్రజలకు చేతినిండా పని దొరుకుతుందని, తద్వారా పేదరికం తగ్గుతుందని మంత్రి సీతక్క అన్నారు. "దేవాదుల ప్రాజెక్టు ద్వారా ములుగు నియోజకవర్గానికి సాగు నీరు రావడం లేదు. తుపాకులగూడెం బ్యారేజీ నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులకు మానవీయ కోణంలో తగిన నష్టపరిహారం అందించాలి. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారంలో కెనాల్స్ పై ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు సరిగా పని చేయక రైతులకు సాగునీరు అందడం లేదు. రామప్ప నుంచి పాకాల పోయే ప్రాంతంలో 6 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి కాలువలు నిర్మించాలి' అని ఇరిగేషన్ మంత్రిని కోరారు. రామప్ప నుంచి లక్నవరానికి కెనాల్ మంజూరు చేశారని, కానీ ఇప్పటివరకు భూసేకరణ జరగలేదన్నారు. ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.దేవాదులను పదేండ్లు పట్టించుకోలేదు : పొంగులేటి...దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్?ను గత ప్రభుత్వం పదేండ్ల పాటు పట్టించుకోలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలంటే ఇంకా 3వేల ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందని తెలిపారు. రైతును రాజును చేయాలనే ఉద్దేశంతో ప్రాజెక్టులకు తమ సర్కార్ అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. "చత్తీస్ గఢ్, మన రాష్ట్రానికి మధ్య ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఆఫీసర్లను అక్కడికి పంపించాం. సమ్మక్క బ్యారేజీని త్వరలో ప్రారంభించి, స్టోరేజ్ చేసిన నీటిని లిఫ్ట్ చేస్తాం' అని తెలిపారు.రైతుల కోసం ప్రాజెక్టులు కడతామని చెప్పి.. కేసీఆర్ వేల కోట్లు లూటీ చేసిండు. తెలంగాణ ప్రజల జీవితాలను తాకట్టు పెట్టి, కమీషన్ల కోసం తప్పుడు పనులు చేయించిండు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, దేవాదుల, సీతారామ.. ఇలా ఏ ప్రాజెక్ట్ చూసినా అవినీతిమయమే. కేసీఆర్ కుటుంబం జేబులు నింపుకోవడానికే సరిపోయింది. కేసీఆర్ హయాంలో రూ. 1.81 లక్షల కోట్లతో ఇరిగేషన్ పనులు చేస్తే, అందులో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎందుకూ పనికిరాకుండా పోయింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగింది. అదీకాక చేసిన పనులకు సంబంధించి రూ. 14 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టిన్రు.

## ఏపీలో దంచి కొడుకున్న వానలు...ఎటు చూసినా వర్షపు నీరు...



**మన వార్త** ఏపీలో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు. వాతావరణ శాఖ హెచ్చరించినట్టుగానే ఏపీలో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో పలు ప్రాంతాలు నీట మునిగాయి.లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. రోడ్లపై నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మరోవైపు విజయవాడ, గుంటూరులోనూ వర్షం కుమ్మేసింది. దెబ్బతో విజయవాడ నగరం అతలాకుతలమైంది. నగరంలో ఎటు చూసినా వర్షపు నీళ్లే కనిపిస్తున్నాయి. నెహ్రూ బస్టాండ్ మొత్తం నీట మునిగింది. ఆర్టీసీ బస్సులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై మోకాళ్లోతు నీరు చేరడంతో వాహనరాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలు చోట్ల వర్షం దాటికి ఇళ్ల గోడలు కూలిపోయాయి. వర్షం దాటికి జనజీవనం స్తంభించిపోయింది. దుర్గమ్మ ఘాట్ వైపు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఇంద్రకీలాద్రిపై కొండ చరియలు విరిగిపడ్డాయి. టెంపుల్‌లోకి బండరాళు పడ్డాయి. దీంతో అధికారులు తొలగిస్తున్నారు.


మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA
epaper
చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA


## పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో
## నూతన రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేస్తా




**మన వార్త** పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో నూతన రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు ఎంపీ గడ్డం వంశీకృష్ణ. 8 వేల కోట్లతో రామగుండం జెన్కో లో సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.పట్టువదలని విక్రమార్కుడు రాజ్ ఠాకూర్.. పవర్ ప్లాంట్ ఏర్పాటు శుభపరిణామం అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో సుమారుగా 2వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయని చెప్పారు. ప్లాంట్ నిర్మాణం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. అలాగే కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి పార్లమెంట్ లో మాట్లాడినట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్టాన్ని అప్పుల పాలు చేసిందన్నారు వంశీకృష్ణ. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందన్నారు.కొత్త విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే మక్కన్ సింగ్ కృషి ఎంతో ఉందన్నారు మంత్రి శ్రీధర్ బాబు. 8 వేల పై చిలుకు కోట్లతో ప్లాంట్ నిర్మాణానానికి ప్రభుత్వం ప్రకటన చేయడం సంతోషమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొకటిగా పూర్తి చేస్తామన్నారు. రామగుండం ప్రాంతంలో నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగాల కల్పన చేయబోతున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు నింపే ప్రయత్నం చేయబోతున్నామని తెలిపారు. గత బీఅర్ఎస్ ప్రభుత్వం హయాంలో సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు.

## సిపిఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్యను పరామర్శించిన

### ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయ రఘురాం రెడ్డి...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 31 (మన వార్త ప్రతినిధి)** ఇటీవల ఖమ్మం హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యా వచ్చిన సిపిఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య ను పరామర్శించి యోా %షె%గక్షేమాలు అడిగిన తెలుసుకున్న ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయ రఘురాం రెడ్డి కాంగ్రెస్ జిల్లా నాయకులు నాగ సీతారాములు సోసైటి చైర్మన్ మండె వీర హనుమంతరావు.సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ.మండల కమిటీ సభ్యులు కాట్రాల తిరుపతిరావు. కొండె కృష్ణ. గండమాల భాస్కర్. వీర్ల సత్యం. చింతల శ్రీను.నల్లగొపు పుల్లయ్య.కున్సోత్ షణ్ముఖ.రవి కిషన్ తదితరులు పాల్గొన్నారు

## ఎదురుగట్ల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**వేములవాడ ఆగస్టు 31 ( మన వార్తా ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**వేములవాడ మండలం ఎదురుగట్ల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ శనివారం కనుక మరియు శ్రావణ చివరి శనివారం కాబట్టి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకోవడం జరిగింది. ఇందులో భాగంగా ఆలయ చైర్మన్ గంగరాజు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చినట్లయితే ఆలయం ఇంకా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## నర్మాలలో తాగునీటి కటకట



**–నెల రోజుల నుండి తాగునీటికి కష్టాలు...**

**గంభీరావుపేట ఆగస్టు 31 మన వార్త ప్రతినిధి:**

గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో తాగునీటి కటకట మొదలైంది. దాదాపు నెల రోజుల నుండి నీటి సరాపర తగినంతగా రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు మోటర్లు కాలిపోయిన గాని రిపేరు చేయడం లేదు .సరాపరా చేసిన మిషన్ భగీరథ నీరు రంగు మారి రావడంతో చర్మ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో బావిలో నీళ్లు సరిపడా ఉన్న గ్రామపంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు మండిపడుతున్నారు. ముఖ్యంగా 6వ 8వ వార్డు ప్రజలు త్రాగునీరు లేక తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో నీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో ధ్యానబోయిన బాలలక్ష్మి, తొట్ల రాజవ్వ పిట్ల ఎల్లవ్వ పిట్ల బాలరాజువ్వ పిట్ల భారతవ్వ పొడలా మేఘమాల ధ్యానబోయిన నరసవ్వ చిలుక దేవవ్వ తొట్ల లత బొంగు సత్తవ్వ బొంగు నీలిమ తదితరులు పాల్గొన్నారు

## గుడాటిపల్లిలో బంగారం అపహరణ



**–మొులంగూర్ లో వరుస దొంగతనాలు...**

**–బెంబేలెత్తుతున్న గ్రామస్తులు...**

**శంకరపట్నం,ఆగస్టు 31(మన వార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**

శంకరపట్నం మండలం మొలంగూర్ పరిధిలోని గుడాడిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన గుర్రం సంజీవరెడ్డి తన భార్య విజయతో కలిసి శుక్రవారం సాయంత్రం కరీంనగర్ లోని తన కుమారుని ఇంటికి ఓ కార్యక్రమానికి వెల్లారు.తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో తాళం పగలగొట్టి తలుపులు తీసి ఉండడానికి గమనించి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి.బీరువాలో రెండున్నర తులాల బంగారం 30 తులాల వెండి లేకపోవడాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.చోరీకి గురైన నగల విలువ సుమారు 2 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలపాడు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు.శుక్రవారం రాత్రి మొలంగూర్ గ్రామానికి చెందిన పిట్టల కొమురయ్యకు చెందిన ట్రాక్టర్ ఆయిల్ ట్యాంకర్ లో గుర్తుతెలియని వ్యక్తులు చెక్కర పోసినట్లు గ్రామస్తులు తెలిపారు.మూడు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన కల్లూరి అనిల్ ద్విచక్ర వాహనం దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.వరుస దొంగతనాలతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి



**శంకరపట్నం,ఆగస్టు 31(మన వార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన షేక్ అతిక్(52) శనివారం వేకువజామున 5 గంటలకు గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తి అతిక్ మృతి పట్ల గ్రామస్తులు కండతడి పెడుతున్నారు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబం రోడ్డున పడే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పేద కుటుంబానికి చెందిన అతిక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.గతంలో పెద్ద కుమార్తె మరణించగా తన కుమారుడు మృతుని కుటుంబంతోనే ఉంటున్నాడు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన విజయవంతం ...



**–ధన్యవాదాలు తెలిపిన టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు...**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 31( మన వార్తా ప్రతినిధి )**కొత్తగూడెం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శుక్రవారం పర్యటన విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, పార్టీ అభిమానులకు టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ధన్యవాదాలు తెలిపారు. ఎంపి పర్యటనలో భాగంగా సుజాతనగర్ మండలంలోని సర్వారం, సింగభూపాలెం, రాఘవపురం, సుజాతనగర్లలో పర్యటించి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ఈ సందర్భంగా వివిధ పార్టీల నుండి 50 కుటుంబాల వారు కాంగ్రెస్ లో చేరగా వారికీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో రామవరం,గౌతమ్ నగర్, కూలీలైన్,న్యూ గొల్లగూడెం లలో 16, 17, 18, 19, 20, 24వ వార్డులకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో తన గెలుపుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోనేరు చిన్ని, ఆళ్ల మురళి, సుజాతనగర్ కాంగ్రెస్ అధ్యక్షులు చింతపూడి రాజశేఖర్, సొసైటీ చైర్మన్ మండె. హనుమంతరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవిప్రసన్న, జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు ఎండి కరీం పాషా, మాజీ ఎంపీటీసీ కసనబోయిన భద్రం, విజయాబాయి, కొప్పుల చంద్రశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, ఆకునూరి కనకరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి ఐదేళ్లు ఎంపీ గా ఉండి మల్కాజ్గిరి ప్రజలకు ఏం చేసావ్..



**మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 31 మన వార్త ప్రతినిధి అంతోని:** మల్కాజ్గిరి జిల్లా అల్వాల్ లోని ఆనంద్ రావు నగర్,వాసవి నగర్, భరత్ నగర్, జానకి నగర్ లో చెరువు కింద ఉన్నవారికి నోటీసులు ఇవ్వడంతో వారిని కలిసి, ధైర్యం ఇచ్చిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్.నోటీసులు వచ్చాయని అంతా ఆందోళన చెందకండి. మాలాంటి వాళ్ళం కూడా ఉన్నాం.ఇప్పటికే హస్మత్ పేట్ చెరువు దగ్గర మాట్లాడాను. పేదోళ్ల జోలికి వస్తే ఖబర్దార్ అని చెప్పాను. కూలి పని చేసుకుంటూ, ప్రైవేట్ ఉద్యోగాలుచేసుకుంటూ, నెల నెలా బ్యాంకుల్లో రుణాలు కడుతూ 60-70 గజాల స్థలంలో ఇల్లు కట్టుకొని నివసిస్తున్న వీరికి నోటీసులు ఇచ్చి వెంటనే కూలగొట్టడం బాధనిపించే అంశం. రుణాలు ఇచ్చిన బ్యాంకు వాడు కూడా కట్టకపోతే నోటీసులు ఇచ్చి కొంత సమయం ఇస్తాడు.. వీరు మాత్రం రాత్రికి రాత్రే హీరో లెక్క, ధర్మాన్నికాపాడుతున్నట్లుగా ఈ పిచ్చి పనులు బందు పెట్టండి. మేము కూడా 20 ఏళ్లు ప్రజాక్షేత్రంలో పనిచేసిన వాళ్ళమే. వారి కష్టాలు, బాధలేంటో తెలిసిన వాళ్ళం. మంత్రిగా పనిచేసినప్పుడు కూడా మా హక్కులేంటి, బాధ్యతలు ఏంటో తెలుసుకొని పని చేశాను. నువ్వు ఐదేళ్లు ఎంపీగా ఉండి ఈ ప్రజలకు ఏం చేసావ్. ఓవుట్ సోర్సింగ్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న వారికి జీతాలు ఇచ్చే దమ్ము లేదు నీకు. మూసి పక్కన నివసిస్తున్న 1200 మందికి ఇల్లు ఇస్తానని చెప్పావు, ఏం ఇస్తావు నువ్వు.చెరువు అంటే కన్నతల్లితో సమానం, కానీ ఇవాళ చెరువులు విషయాన్నిపంచుతున్నాయి. చెరువు ఏ వ్యవసాయం కోసం ఉందో,ఎకలాజికల్ బ్యాలెన్స్ కోసం ఉంటుందో,మత్స్యకారులకు సంపద అవుతుందో ఆ పర్పస్ ఇవాళ లేదు.నీకు జ్ఞానం ఉంటే ఏ చెరువులైతే విషపూరితమైన వాటిలో ఉన్న మురికి నీరు అంతా బయటికి పంపు.మిస్టర్ రేవంత్ రెడ్డి నీకు పదవి ఎలా వచ్చింది.... మీ అమ్మో నాన్న ఇస్తే రాలేదు. తెలంగాణ ప్రజల ఆత్మను ఆవిష్కరించి, నువ్వు ఏదో మంచిగా పరిపాలిస్తావని చెప్పి రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన పదవది.కోర్టులు కూడా మిమ్మల్నితప్పుపడుతున్నాయి.కోర్టులు స్టే ఇస్తాయి, వెసులుబాటు ఇస్తాయి. ఎఫ్ టి ఎల్ ఉంది వాస్తవమే కావచ్చు కానీ ఎలా కట్టుకున్నారు, ఎలా పర్మిషన్లు వచ్చాయి ఇవన్నీ ఆలోచించాలని చెప్పి తాత్కాలిక స్టే ఇస్తుంది. నువ్వు ఇష్టం వచ్చినట్టుగా బుల్డోజర్ల పంపించి కూలగొడతా అంటే నడుస్తాదా...70 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో 44 ఏళ్లు పాలిచ్చింది మీ పార్టీ కాదా. గత ముఖ్యమంత్రులు ఏం చేశారు. నువ్వు ఏదో సుద్దపూసలెక్క, సత్య హరిశ్చంద్రుడు లెక్క ఇవాళ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నావు.ఇవాళ ఇంత వర్షంలో కూడా మీరు ఆందోళన చెందుతున్నారని, ధైర్యం చెప్పడానికి వచ్చాము.మీకు ఇచ్చిన నోటీసులు అన్ని నాకు ఒక జిరాక్స్ రూపంలో ఇవ్వండి. మీరు నన్ను గెలిపించింది ఇంట్లో పడుకోవడానికి కాదు కదా...మీ కోసం నేను పోరాడుతాను. సోషల్ మీడియాల కోసం, ట్రెండింగ్ కోసం మాట్లాడం...సమస్య వస్తే మాట్లాడుతాం. ప్రజల కోసం "ఎవడ్రా" అంటాం. నాకు సాధారణంగా ఆ భాష రాదు ప్రజలను ఇబ్బంది పెడితే మాత్రం ఊరుకోము అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి. బిజెపి నేతలుసి.మానిక్ రెడ్డి. మల్లికార్జున్. కార్తీక్ గౌడ్. లక్ష్మణ్. అంటోనీ రవి. ప్రశాంత్ రెడ్డి. ఆనంద్ రావు నగర్ కాలనీ అధ్యక్షులు హరిబాబు. ఆనందరావు. రాజయ్య. భారతీ. మదన్ మోహన్. కాలనీల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పేదలను విస్మరించిన మోడీ పాలన

### పేద, మధ్యతరగతి ప్రజలు బ్రతకలేని దయనీయపరిస్థితి...



**–సిపిఐ జిల్లా కార్యదర్శి పోర్టు ప్రసాద్...**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 31( మన వార్త ప్రతినిధి )**సెప్టెంబర్ 2న జరిగే ఆందోళనను జయప్రదం చేయండి పేదలను విస్మరించి మోడీ పాలన సాగిస్తున్నారని సంపన్న వర్గాలు, కార్పొరేట్ శక్తుల కోసమే పాలన సాగుతుందని సి.పి.ఐ జిల్లాకార్యదర్శి పోటు ప్రసాద్ ఆరోపించారు. పేద, మధ్యతరగతి ప్రజలు బ్రతకలేని దయనీయపరిస్థితి ఏర్పడిందన్నారు. సి.పి.ఐ ఖమ్మం నగర ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్భవన్లో మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ దశబ్దా కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు మూడు రెట్లు పెరిగాయని అల్పాదాయ వర్గాల రాబడి కనిష్ట స్థాయి చేరిందన్నారు. ఆర్థిక అంతరాలు పెరుగుతూ పేదలు మరింత పేదలవుతుంటే ధనవంతులు కుభేరలవుతున్నారని ఇది దేశ భవిష్యత్ పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. గత పాలకులు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ చట్టాన్ని అమలు చేసేవారని మోడీ ప్రభుత్వం ధరల నియంత్రను పూర్తిగా విస్మరించిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు రసాయనిక ఎరువులు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ప్రతి 10 సంవత్సరాల కొకసారి జనగణన చేపట్టావారని మోడీ దానిని పట్టించుకోవడం లేదని ప్రసాద్ ఆరోపించారు. 2021లోనే జనగణన చేయవలసి ఉన్నా చేయక పోవడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఆశించిన స్థాయిలో దక్కడం లేదని ఆయన తెలిపారు. జనభా గణన చేపట్టాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, అర్హులందరికీ రేషన్కార్డులివ్వాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని ప్రసాద్ కోరారు. ధరల నియంత్రణ జరిగేవరకు సి.పి.ఐ జాతీయ పిలుపులో భాగంగా దశలవారీ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో సి.పి.ఐ కార్యవర్గసభ్యులు తాటి వెంకటేశ్వరరావు, రావిశివరామకృష్ణ, వివిధ ఏరియాల పార్టీ బాధ్యులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయండి..



**కరీంనగర్, ఆగస్టు 31( మన వార్త ప్రతినిధి):** బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్థానిక గీత భవన్ లోని కాన్ఫరెన్స్ హాల్లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాలలో కలెక్టరేట్ వద్ద నిరసన చేపడతామని తెలిపారు. బీసీ సమగ్ర కుల గణన చేపట్టి రాజ్యాధికారంలో బీసీల వాటా తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీల కులగనన కోసం ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడానికి స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇది బీసీల పోరాట విజయమని అన్నారు. కులగణన ప్రారంభించేందుకు ప్రభుత్వంపై తమ పోరాట%శీ% ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నారాజు రాకేష్ చారి , బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాస సంజీవ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగు సంపత్ గౌడ్, ఎడ్ల సురేందర్ , కాయితాజీ బ్రహ్మచారి, నలవెలి రవి, బండారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ ను కలిసిన నాయిని రాజేందర్ రెడ్డి



హన్మకొండ ఆగస్టు31(మనవార్తప్రతినిధి కోడెపాకశ్రీకాంత్): అంబేడ్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ముఖ్యమంత్రి ఆరాతీశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. కాళోజీ కళాక్షేత్రం, నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ వాస్తవ్యులు డాక్టర్ తిరుణహరి శేషు ప్రభుత్వ పనితీరు, విధివిధానాల రూపకల్పనలో ఉన్న ముఖ్య అంశాల పై 34ఆర్టికల్స్ తో రాసిన "కృషివలుడు" పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందించారు.

## రాజన్న ఆలయంలో పోగొట్టుకున్న బ్యాగును అప్పగించిన ఏఎస్ఐ కరణ్ సింగ్...



**వేములవాడ ఆగస్టు 31 ( మన వార్తా ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో నిత్యం వేలాదిమంది భక్తులు రాజ్జన్నను దర్శించుకోవడం జరుగుతుంది. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు తమ వస్తువులు పోగొట్టుకున్నట్లయితే రాజన్న ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తెలిసిన వెంటనే వాటిని గుర్తించి చాక చక్యంగా అప్పగిస్తున్నారు. ఇందుకు నిదర్శనం శనివారం రోజున పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్న కాల్వల గ్రామానికి చెందిన భక్తురాలు రాజన్న దర్శనానికి వచ్చి బ్యాగు పోవడంతో రాజన్న ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఏ ఎస్ ఐ. కరణ్ సింగ్ ఈ విషయం తెలిసిన వెంటనే స్పందించి వెంటనే చాకచక్కగా గుర్తించి ఎస్పీఎఫ్ సిబ్బంది పోయిన బ్యాగును భక్తురాలకు అప్పగించారు. ప్రతి ఒక్కరూ వీరిని అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవలయ సిబ్బంది ఏఎస్ఐ కరణ్ సింగ్ కానిస్టేబుల్ వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## వసతిగృహంలో సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు

**శంషాబాద్,ఆగస్టు 31. (మన వార్త ప్రతినిధి )**



కస్తూరిబా బాలికల వసతిగృహంలో సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు. సార్ మీకు దండం పెడతా మా సమస్య పరిష్కరించండి మాకు పురుగులు అన్నం పెడుతున్నారు, టీచర్లు జొన్న రొట్టెలు చపాతీలు, చికెన్ కర్రీలు చేసుకొని తింటున్నారు. రంగారెడ్డి - శంషాబాద్ మండలంలోని పాలమాకులే కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులకు పురుగులు అన్నం పెట్టి, ఉపాధ్యాయులు మాత్రం వేరే కూరలు చేసుకుని తింటున్నారు. అడిగితే ఇంటి నుండి తెచ్చుకోండని అంటున్నారు. మంచి నీటి సమస్య కూడా ఉంది. చెప్పలేని పదజాలంతో బూతులు తిడుతున్న టీచర్లు. టీచర్లు కులవివక్ష చూపిస్తున్నారు అంటున్న విద్యార్థులు సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు.

## శివయ్యకు లక్ష బిల్వార్చన...



**శంకరపట్నం,ఆగస్టు 31(మన వార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**
శ్రావణమాసం మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా శంకరపట్నం మండలం మొలంగూర్ శివాలయంలో పూజారి బంగిమఠం శివప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం లక్ష బిల్వార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి పర్వదినాన గ్రామస్తులు మహిళలు హాజరై మారేడు దళాలు తెంపి శివునికి సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పూజారులు బంగిమటం నాగరాజు,ఫనిధర్, తదితరులు పాల్గొన్నారు.

## తూములు ధ్వసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**– మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్...**
**హైదరాబాద్ ఇన్చార్జి భాస్కర్ చారి, సెప్టెంబర్ 1, (మనవార్త)**
ఘట్కేసర్ మండలం వెంకటాపూర్ లోని నాడెం చెరువు తూంను రాత్రికి రాత్రే ధ్వసం చేసి చెరువు లోని నీళ్లు తీయాలనీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం నాడెం చెరువు ను సందర్శించిన అనంతరం మాట్లాడుతూ నాడెం చెరువు కబ్జా చేసిన వారే తూంలను ధ్వసం చేసారని, దీని వల్లన ఎఫ్ టీ ఎల్ పరిధి తగ్గించాలనే దుర్ధుదేశంతో కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ విషయమై హైడ్రా కమిషనర్ కు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక జీ ఓలతో రోడ్డును కుదించారాని ఆరోపించారు. తూము ధ్వసం చేసిన వారిపై. రోడ్డు ఇరుకు చేసిన వారి పై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్, ఘట్కేసర్ మండల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవీ విరమణ సన్మాన కార్యక్రమము




**-రిటైర్మెంట్ అయిన పోలీస్ అధికారులు కూడా పోలీస్ కుటుంబం లో భాగమే...**
**-జిల్లా ఎస్పీ శ్రీ కే.నారాయణ రెడ్డి...**
**వికారాబాద్ , ఆగస్టు 31(మన వార్త ప్రతినిధి)**సుధీర్ఘ కాలంగా పోలీస్ డిపార్ట్మెంట్ కు సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) y.యాదయ్య, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్ఐ) ఎండి.యాకూబ్ అలీల పదవి విరమణ కార్యక్రమం జిల్లా పోలీస్ కార్యాలయం లో జిల్లా ఎస్పీ కె . నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శాలువా, జ్ఞాపికలతో సత్కరించి భాజా భజయింత్రులతో ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. పదవి విరమణ పొందుతున్న వై.యాదయ్య మరియు ఎండి యాకూబ్ అలీ లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పోలీస్ డిపార్ట్మెంట్ నందు పోలీస్ కానిస్టేబుల్ గా భర్తీ అయి యాకూబ్ అలీ ఏఎస్ఐగా, యాదయ్య ఎస్ఐ లుగా పదోన్నతి పొంది పోలీస్ డిపార్ట్మెంట్ నందు పలు పోలీస్ స్టేషన్స్ లలో పలు రకాలుగా విధులు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమములో జిల్లా ఎస్పి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది తప్పక ఉంటుంది, ఇద్దరు అధికారులు విధుల పట్ల అంకిత భావముతో ఉండి వారి యొక్క పూర్తి సర్వీస్ కాలములో ఎటువంటి రిమార్క్స్ లేకుండా, సంపూర్ణ ఆరోగ్యముతో పదవీ విరమణ పొందడము అనేది గొప్ప విషయం,పోలీస్ డిపార్ట్మెంట్ నందు పని చేస్తూ రిటైర్మెంట్ అయిన అధికారులు కూడా పోలీస్ కుటుంబం లో భాగమే, పదవి విరమణ పొందిన అధికారులకు ఏదైనా అవసరం ఉన్న నేరుగా సంప్రదించి మాట్లాడాలని, సుధీర్ఘ కాలంగా పోలీస్ డిపార్ట్మెంట్ నందు విధులు నిర్వహించి ప్రజలకు సేవ చేయడం దేవుడు ఇచ్చిన వరం అని, ఇకముందు అధికారులు తదుపరి జీవితమును కూడా తమ కుటుంబ సభ్యులతో సుఖ సంతోషలతో గడపలని, పోలీసు శాఖ నుండి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ లను అందించడం జరుగుతుంది అని, పదవి విరమణ పొందుతున్న ఇద్దరు అధికారులకు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపినారు. కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి , డిటిసి డిఎస్పి విజయ్ కుమార్ , ఏఓ జ్యోతిర్మని , పరిగి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ , ఆర్ఐ లు,ఎస్ఐ లు, జిల్లా పోలీస్ ప్రసిడెంట్ అశోక్ , డిపిఓ సిబ్బంది మరియు పదవి విరమణ పొందుతున్న అధికారుల కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారి ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ ...



**మహబూబ్ నగర్. ఆగస్టు 31. (మన వార్త ప్రతినిధి )**పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీసు అధికారులు రంగయ్య ASI బోత్పూర్ PS మరియు లక్ష్మి నారాయణ, జూనియర్ అసిస్టంట్ లను జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. తమ సర్వీస్ ను ముగించుకొని పదవీ విరమణ పొందడం జరిగింది. క్రమశిక్షణతో పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించిన వారిని ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన పోలీసు అధికారిని కుటుంబాల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ విధమైన సహాయం కావాలన్నా వెంటనే తమను సంప్రదించాలని వారికి తెలియజేశారు. అలాగే జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ నందు గత ఏడాది నుండి విధులు నిర్వర్తిస్తున్న RI శ్రీను, జిల్లా నుండి నల్గొండ జిల్లా కి బదిలీ అయి రిలీవ్ అయ్యి వెళ్తున్నదున, వీడ్కోలు సన్మాన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో AR అదనపు ఎస్పీ సురేష్ కుమార్, DCRB DSP రమణా రెడ్డి, AR DSP శ్రీనివాసులు, AOరుక్మిణి బాయి పాల్గొన్నారు.

## టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయండి



**హైదరాబాద్ ఇన్చార్జి భాస్కర్ చారి, సెప్టెంబర్ 1, (మనవార్త)**
తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అచ్చంగా టీటీడీ అనుసరించిన తరహాలోనే బోర్డుకు స్వయం ప్రతిపత్తి, విధి విధానాలు ఉండేలా అవసరమైతే చట్ట సవరణ చేయాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయ రాజ గోపురానికి బంగారు తాపడం పనులను ప్రారంభించాలని ఆదేశించారు. స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ ప్రాజెక్టుల్లో భాగంగా దేవాలయాల అభివృద్ధిపై డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులు చాలా వరకు అర్ధంతరంగా నిలిచిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ అలా ఆగిపోవడానికి వీల్లేదని, ఇప్పటివరకు ఏమేం అభివృద్ధి పనులు జరిగాయి, ఇంకా ఏమేం అసంపూర్తిగా ఉన్నాయనే వివరాలతో వారం రోజుల్లో సమగ్ర నివేదికను అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం కీసర గుట్టపై ఉన్న రామలింగేశ్వర ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి ప్రతిరూపంగా, అచ్చం అదే నమూనాతో కీసరగుట్ట ఆలయాన్ని నిర్మించాలని చెప్పారు. ఇప్పుడున్న అధునాతన టెక్నాలజీతో రామప్ప ఆలయ ఆకృతిలో యథాతథంగా కీసర ఆలయం పునర్నిర్మాణం చేపట్టాలని సూచించారు.

## గుప్పుమన్న గంజాయి..



**-మహిళా వద్ద 490 గ్రాముల గంజాయి స్వాధీనం...**
**జమ్మికుంట, ఆగస్టు 31( మన వార్త ప్రతినిధి):**
గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన మహిళ ను అదుపులోని తీసుకుని గంజాయి ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఎక్సైజ్ అధికారుల వివరాల ప్రకారం జమ్మికుంట పట్టనంలోని రైల్వే స్టేషన్ పరిధి కొత్తపల్లిలో అధికారులు చేపట్టిన దాడిలో ఎండి శమిమ్ అనే మహిళ వద్ద 490 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహిళను విచారించగా పట్టణంలో ఎవరికి విక్రయించడం లేదని, మహారాష్ట్ర బల్లార్షాలకు ఎగుమతి చేయుటకు కూలి ఇస్తారని మహిళ చెప్పినట్లు తెలిపారు. మహిళను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసి గంజాయి నీ స్వాదీనపరచుకుని,మహిళ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ సీఐ ఎం మాధవి లత,ఎస్సై ఎం సౌమ్య,హెడ్ కానిస్టేబుల్ ఐలయ్య,పెద్దన్న,భాస్కర్, రేణుక ,మహేష్,పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పనుల సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలి



**-ప్రభుత్వ సర్వేయర్లతో సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**
**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 31, ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
ప్రభుత్వ పనులకు సంబంధించిన సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్లో ప్రభుత్వ సర్వేయర్లతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఇటీవల బదిలీ పై జిల్లాకు వచ్చిన సర్వేయర్లు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఉద్యోగులు అందరూ స్థానికంగానే ఉండాలని సూచించారు. ప్రభుత్వానికి చెందిన సర్వే పనులు వేగంగా పూర్తి చేయాలని, పెండింగ్ లో పెట్టవద్దని ఆదేశించారు. రైతులు, ఇతర వ్యక్తుల దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించా లని,హౌఇంచార్జీ బాధ్యతలు ఉన్న వారు అక్కడ మూడు రోజులు, ఇక్కడ జిల్లాలో మూడు రోజులు విధులు నిర్వర్తించాలని వివరించారు. సర్వేయర్ల పనితీరు పై వారం, నెల వారీ నివేదికలు ఇవ్వాలని ఏడీ సర్వే వినయ్ కుమార్ ను అదనపు కలెక్టర్ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ డీఐ లు బాలచందర్, రత్నం, ఆయా మండలాల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి



**వేములవాడ, ఆగస్టు 31, ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
మిడ్ మానేర్ ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. మిడ్ మానేర్ ముంపు గ్రామాలు ఆరేపల్లి, సంకేపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, శభాష్ పల్లి, చింతల్ ఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో చీర్లవంచలో శనివారం సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ఇండ్లకు పరిహారం, పట్టాలు, 18 ఏండ్లు నిండిన వారికి పరిహారం, ఆలయాలకు పరిహారం రాలేదని ఇతర సమస్యలను ప్రభుత్వ విప్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామాలకు సరిహద్దులు చూపాలని, ఆక్రమణలు నిరోధించాలని, స్మశాన వాటికల వద్ద సమస్యలను పరిష్కరించాలని, పలువురు రియల్ ఎస్టేట్ నిర్వాహకులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ముంపు గ్రామాల పరిధిలో వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్ లకు అనుమతులు ఉన్నాయా? డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలని, ప్రభుత్వ భూములపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. మానవతా దృక్పథంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పరిహారం, మిగితా బెనిఫిట్స్ వచ్చేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. నోటిఫైడ్ కానీ వారి దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయిస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఎస్డీసీ రాధాబాయ్, డీఆర్డీఓ శేషాద్రి, వేములవాడ అర్బన్ తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలి



**–తంగళ్లపల్లి పీ హెచ్ సీ ఆకస్మిక తనిఖీ**
**–కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**తంగళ్లపల్లి, ఆగస్టు 31, ( మన వార్తా ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్)**
వర్షాకాలం నేపథ్యంలో దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీ హెచ్ సీ)ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, ఫార్మసీ, వ్యాక్సిన్ గది, ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. ఫిజియో థెరపీ సేవల రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఓపీ ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దవాఖాన ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో రక్త పరీక్షలు ఎక్కువ సంఖ్యలో చేయాలని సూచించారు. సీసీ టీవీ మరమ్మత్తు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇక్కడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ, హెూమియో డాక్టర్ డాక్టర్ దీప్తి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నిరంతర సేవకుడు, ప్రజా బంధు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్...



**వేములవాడ ఆగస్టు 31 ( మన వార్తా ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
ప్రజా సమస్యల పరిష్కారమే పరమవదిగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందుకు పోతున్న అలుపెరుగని బాటసారి ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఉదయం 8 గంటల నుండి మొదలుకొని రాత్రి 10 అయిన 11 అయిన ప్రజాలు ఏ సమయాన వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు.. అధికారం ఉందని ఆర్భాటం ప్రదర్శించకుండా సామాన్యుని వలె ప్రతి ఒక్కరి సమస్యను వింటూ వెంటనే సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారనికి ఆదేశాలు జారీ చేస్తున్నారు.ప్రజా సమస్యలపై వారు స్పందిస్తున్న తీరుపట్ల ప్రజల హర్ష వ్యక్తం చేస్తున్నారు.

## రాజన్న ఆలయ ఉద్యోగుల పదవీవిరమణ



**వేములవాడ ఆగస్టు 31 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
రాజన్న ఆలయ ఉద్యోగ వర్గం లో పర్యవేక్షకులుగా అల్లి శంకర్ ,ముఖ్య అర్చకులుగా అప్పాల కరుణాకర్ ,స్కావెంజర్ గా జాక్వాల్ విధులు నిర్వర్తిస్తూ ఈరోజు పదవీవిరమణ సందర్భంగా ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని ఓపెన్ స్లాబ్ యందు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మొదటగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు తదుపరి ఆలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్ మరియు ఈ ఈ రాజేష్ ,ఏ ఈ ఓ లు జయకుమారి, శ్రీనివాస్ లు మరియు ఆలయ ఉద్యోగులు పదవీవిరమణ చెందిన ఉద్యోగులకు శాలువతో సత్కరించారు . ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పదవి విరమణ మహోత్సవంలో పాల్గొన్న సిపిఐ నాయకులు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 31 (మన వార్త ప్రతినిధి)**
ఈ కార్యక్రమంలోరైతు సంఘం జిల్లా నాయకులు తాళ్లూరు పాపారావు సిపిఐ మండల సంయుక్త కార్యదర్శి కుమారి హనుమంతరావు ఏ ఐ టి యు సి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్ తాళ్ల వెంకటేశ్వర్లు దండు నాగేశ్వరరావు ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు కేశవరావు ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకల వెంకటేష్ గడ్డం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

## సిరిసిల్లలో ఏర్పాటు చేసినట్లు వేములవాడ లో కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది



**–సామజిక సేవకులు, మధు మహేష్**
**–గల్ఫ్ దేశాలలో ఈ పద్ధతి పాటిస్తున్నారు.**

**వేములవాడ ఆగష్టు, 31( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
మన ఇంట్లో వాడకుండా పక్కకు పెట్టిన బట్టలు మరీ చినిగినవి కాకుండా, వేరే వాళ్ళు వేసుకోవడానికి వీలుగా,పాత బట్టలు అంటే చీరలు గాని దోతులు గాని డ్రెస్సులు గాని ఇంకా ఏవైనా, పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు తీసుకుని వచ్చి ఒక దగ్గర వేసే ఒక షేడ్ లాగా ఏర్పాటు చేస్తే అక్కడ వారు వీలైన సమయంలో తీసుకొచ్చి అందులో వేస్తారు. ఇలాంటి బట్టలను ఇక్కడ పెడుతున్నాము అని సమాచారం వారికి చేరేలా ప్రచారం చేస్తే నిరుపేదలు ఆ బట్టలు తీసుకుని వెళ్లే అవకాశం ఉంటుంది. కావున దీని గురించి మనం కాస్తా ఆలోచిస్తే బాగుంటుందని, ఇప్పటికే గల్ఫ్ దేశాలు ఈ పద్ధతి పాటిస్తున్నారని,వేములవాడ సామాజిక సేవకులు మధు మహేష్ అన్నారు.

## విద్యార్థులకు కావాల్సిన వసతులు అన్ని కల్పించాలి



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 31, ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్)**
ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లలో విద్యార్థులకు కావాల్సిన వసతులు అన్ని కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లాలోని వసతి గృహ భవనాల యజమానులు, విద్యాలయాల ప్రిన్సిపాళ్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వసతి గృహాల్లో ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారు? ఎన్ని గదులు ఉన్నాయి? టాయిలెట్స్, కిచెన్ ఇతర సదుపాయాలపై సంబంధిత విద్యాలయాల ప్రిన్సిపాళ్లను ను ఆరా తీశారు. శానిటేషన్, మెనూ పై వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి, వసతి గదులు, టాయిలెట్స్, మెస్ హాల్ ఉండాలని, ఈ మేరకు పక్కా ప్రణాళికతో భవనాల యజమానులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వసతి గదుల కిటికీలు, డోర్లకు దోమతెరలు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు సమకూర్చాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో పంచాయతీ రాజ్, రోడ్స్ అండ్ బిల్డింగ్ అధికారులతో సర్వే నిర్వహించాలని, ఏ ఏ వసతులు కావాలో నివేదిక ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రత తప్పకుండా అవగాహన కల్పించాలని వివరించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి విద్యాలయంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించేలా చూసుకోవాలని, ఐరన్ లోపం ఉన్న పిల్లలకు మందులు, పండ్లు ఇవ్వాలని ఆదేశించారు. ఆహార పదార్థాలు తయారు చేసే సిబ్బందికి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించాలని, నిలువ ఉన్న ఆహారం ఇవ్వకూడదని ప్రిన్సిపాళ్లకు కలెక్టర్ సూచించారు. ఇక్కడ డీఈఓ రమేష్ కుమార్, జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, సాంఘిక సంక్షేమ గురుకులాల కో ఆర్డినేటర్ థెరిసా, ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాళ్ళు, భవనాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేసే బాధ్యత మాది



**–రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు**
**–ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్.**
**–ఎరువుల గోదాం నిర్మాణానికి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్**

**వేములవాడ ఆగస్టు 31 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
వేములవాడ అర్బన్,రూరల్ మండలంలోని మారుపాక, మల్లారం, నూకలమర్రి గ్రామంల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి వేములవాడ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన ఎరువుల గోదాం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని భూమి పూజ నిర్వహించారు.ఆది శ్రీనివాస్ కామెంట్స్.రైతుల ప్రయోజనాల కోసం,అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది..దేశానికి, ప్రపంచానికి అన్నాన్ని అందించే రైతన్నకు అండగా నిలవలసిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంది.రైతుల ద్వారా ఎన్నికైన ఫ్యాక్స్ సంఘాలు, సింగిల్ విండోలు రైతులకు సేవలను అందిస్తున్నాయి.గోదాంలో నిర్మాణాల వలన రైతులకు ఎరువులు అందుబాటులో ఉండడంతో పాటు, విత్తనాల నిల్వ చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయి.జిల్లా కలెక్టర్ తో జరిగిన మొదటి సమావేశంలో ప్రతి గ్రామానికి ఎరువుల గోదాం నిర్మాణం చేయాలని ఆరోజు సమావేశంలో చెప్పడం జరిగింది.ప్రతి గ్రామంలో రైతులకు గోదాం నిర్మాణం చేసి అందుబాటులో ఉంచడం వలన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం కొనుగోలు చేసి ఆయా గ్రామాల్లో గోదాంలో నిలువ చేసే అవకాశం ఉంటుంది..రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు..అర్హులైన ప్రతి ఒక్క రైతు రుణమాఫీ చేసే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది..మీరు ఎన్నుకున్న సేవకుడిగా మీకు మాటిస్తున్న అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తాం..మేం ప్రజల నుంచి వచ్చాం ప్రజాపాలన అందిస్తున్నాం.ప్రజల పక్షాన ఏ సమస్య ఉన్న పరిష్కారానికి రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధంగా ఉంది.

## శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి



**గంభీరావుపేటఆగస్టు 31మన వార్త ప్రతినిధి**
రెడ్డి సంక్షేమ సంఘం లో విశ్వహిందూ పరిషత్ మరియు గణేష్ మండపాల నిర్వాహకులతో డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి సమావేశం నిర్వహించి గణేష్ మండపాల నిర్వాహకులతో డిఎస్పి మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మండపాల వద్ద డీజే లకు అనమతి లేదని, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసువారికి సహకరిస్తూ శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి వేడుకలు జరుపుకోవాలని పోలీస్ శాఖ నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదని ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయాలని సీసీ కెమెరాలు ఏర్పాటు వలన ఏ చిన్న సంఘటన జరిగిన గుర్తించ వచ్చు అన్నారు మండపాల వద్ద మద్యం సేవించడం అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే వారితో పాటుగా మండపాల నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ప్రతి మండపం వద్ద విధిగా పాయింట్ బుక్కు ఏర్పాటు చేయడం జరుగుతుందని పోలీసు అధికారులు బ్లూ కోర్టు సిబ్బంది తరచూ మండపాలు తనిఖీ చేయడం జరుగుతుందని. ఇరుపవస్తులతో మండపాలు ఏర్పాటు చేయవద్దని షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి మండపాల నిర్వాహకులకు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలి అని సూచించారు. నిర్దేశించిన సమయానికి శాంతియుత వాతావరణంలోమండపాల నిర్వాకులు విగ్రహాల నిమజ్జనం పూర్తిచేయాలని మండపాల నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ బి రామ్మోహన్ తో పటు వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్ రికవరీ




**శంకరపట్నం,ఆగస్టు 31(మన వార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను పోలీసులు సిఈఐఆర్ పోర్టల్ సాయంతో కనుక్కొని శనివారం బాధితురాలికి అప్పగించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన సజ్జన సులోచన రూ,,15వేల విలువగల స్మార్ట్ ఫోన్ కేశవపట్నంలో పోయిందని సిఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయగా వారి మొబైల్ ఫోన్ ను గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకొని బాధితురాలుకు శనివారం పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా తమ సెల్ ఫోన్ పోగొట్టుకున్నా..చోరీకి గురైన సీఈఐఆర్ వెబ్ సైట్ లో పూర్తి వివరాలను పొందుపరచాలని సూచించారు.బాధితురాలు సులోచన ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

## కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి...




**జహీరాబాద్, ఆగస్టు 31( మన వార్త ప్రతినిధి టి అశోక్ కుమార్):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని అసద్గంజ్ గ్రామ కూడలి వద్ద, జాతీయ రహదారి 65 మీదగా, ముంబై వైపు వెళుతున్న మహారాష్ట్ర పాసింగ్ ఎమ్ హెచ్ 21 బివి 8998 నెంబరు గల కారు సైకిల్ పై వెలుతున్న వ్యక్తిని ఢీకొనగా, క్షతగాత్రుడు చనిపోయినట్లు చిరాగ్ పల్లి ఎస్ఐ కే రాజేందర్ రెడ్డి తెలిపారు. జహీరాబాద్ మండల పరిధిలోని సత్వార్ గ్రామానికి చెందిన కోహిర్ పెంటప్ప తండ్రి బాలప్ప వయస్సు 65 సంవత్సరాలు, వృత్తి వ్యవసాయం అనే వ్యక్తి ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడు సత్వార్ నుండి జాతీయ రహదారికి అటువైపున ఉన్న అసద్గంజ్ గ్రామానికి వెళ్లే రోడ్డు వైపున వ్యవసాయ పొలానికి వెళదామని, ఇటు నుండి జాతీయ రహదారిని దాటి వెళ్లే క్రమంలో కారు అతివేగంగా వచ్చి బాధితున్ని ఢీ కొట్టిందని, కారు అతివేగం కారణంగా పెంటప్ప ఎగిరి సంఘటన స్థలంలోనే మృతి చెందాడని స్థానికులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.